
జడ్చర్లలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు


చిన్నచింతకుంట మండలం నెల్లికొండి గ్రామంలో..


బీజేపీ ఆధ్వర్యంలో..


క్రిస్టియన్‌పల్లి ఆదర్శనగర్‌లో..


రంగారెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అంబేడ్కర్ జీవితం.. ఆదర్శనీయం


జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎస్పీ జానకి


కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఉద్యోగులు

సాక్షి నెట్‌వర్క్: బడుగు, బలహీన వర్గాల పెన్నిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం జిల్లావ్యాప్తంగా బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, యువజన సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గండేడ్ మండలం రంగారెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అదే విధంగా జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అంబేడ్కర్ నూతన విగ్రహాలను ఆవిష్కరించి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంబేడ్కర్ భారత రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని.. సామాజిక సమానత్వం, విద్య ఇలా ఎన్నో అంశాలపై పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3తోనే తెలంగాణ స్వరాష్ట్రం ఆకాంక్ష సిద్ధించిందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.


కోయిల్‌కొండలో..


దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో..


బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..



పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో..


అడ్డాకులలో..


నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


పాలమూరు యూనివర్సిటీలో..


మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో..


మహబూబ్‌నగర్ మండలం కోటకదిరలో..

బాబా సాహెబ్ ఆశయాలు కొనసాగిద్దాం


జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్ /మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/హన్వాడ: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రోజు ఎంతో చారిత్రాత్మకమైనదని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొంది, చట్టంగా మారుతుందని చెప్పారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు సకలజనుల కులగణనను విజయవంతంగా పూర్తిచేశామని గుర్తుచేశారు. ప్రజాప్రభుత్వం అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తూ.. రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థ విద్యానిధి నుంచి గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థిని గోపిక, వరంగల్ మెడికల్ కాలేజీ విద్యార్థిని హరితకు రూ.లక్ష చొప్పున చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

■ హన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే యెన్నం భూమిపూజ చేశారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమాల్లో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకుమార్‌గౌడ్, ఎన్పీ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సీజె బెనహర్, అజ్మత్‌అలీ, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్, సత్యారెడ్డి, సురేందర్‌రెడ్డి, స్వరూపరెడ్డి, గంగిరెడ్డి, అచ్చెన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్


భూత్పూర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్/అడ్డాకుల: ప్రపంచ మేధావి బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం భూత్పూర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాల సాధన దిశగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ పేరుతో గ్రామగ్రామానా అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. అదే విధంగా సింగిల్‌విండో కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

■ అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ పాఠశాలలో అదనపు గదులను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించడంతో పాటు ఎస్సీకాలనీలో వివిధ అభివృద్ధి పనులు, హైస్కూల్ ప్రహరీ నిర్మాణం, వాల్మీకి, ఎస్సీ కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. కాటవరం తండాలో సీతారాముల దేవాలయంలో నిర్వహించిన శివలింగం, అంజనేయస్వామి, నవగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తోట శ్రీహరి, నాగిరెడ్డి, జగదీశ్వర్, నాగార్జున్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ షిర్డీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయిబాబాకు అభిషేకం, గణపతిపూజ నిర్వహించారు. ఆదివారం సుప్రభాత సేవ, కాగడ హారతి, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, మండపారాధన, సాయంత్రం సంధ్యాహారతి, నవగ్రహ హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మజా గోపాల్‌యాదవ్ తెలిపారు.

సన్న బియ్యం లబ్ధిదారు ఇంట్లో ఎమ్మెల్యే భోజనం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పేదలకు సన్న బియ్యం పంపిణీతో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని టీడీగుట్టలో నివాసముంటున్న పద్మమ్మ, నర్సింహులు దంపతుల ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీతో ప్రతి కుటుంబానికి రూ.వేయి నుంచి రూ.1,500 వరకు ఆదా అవుతోందన్నారు. కాగా, ఎమ్మెల్యే తమ ఇంట్లో భోజనం చేయడం ఎంతో సంతోషంగా ఉందని లబ్ధిదారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబ, చిన్న, ప్రశాంత్, నవనీత, చర్ల శ్రీనివాస్, శంకర్, వన్ టౌన్ సీఐ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆది, సోమవారం స్థానిక 3, 19 వార్డుల్లో స్వతంత్ర ఏజెన్సీ బృందం కుక్కలను పట్టుకుని జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించింది. అక్కడ వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశాక మళ్లీ మున్సిపాలిటీలో వదిలిపెట్టనున్నారు. ఏడు రోజులపాటు సెంటర్‌లో కుక్కలను ఉంచనున్నారు. ఆదివారం 20 కుక్కలు, సోమవారం 30 కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలించారు. కాగా, పట్టణంలోని 9వ వార్డులో ఏబీసీ సెంటర్ నిర్మించినప్పటికీ విద్యుత్ సమస్య కారణంగా జిల్లా కేంద్రంలోని సెంటర్‌కు కుక్కలను తరలిస్తున్నారు. ఇక్కడి సెంటర్‌లో విద్యుత్ కనెక్షన్ కోసం ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని.. మున్సిపాలిటీ నుంచి డబ్బులు చెల్లించి త్వరలోనే పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని న్యాయవాది బెక్కం జనార్దన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో సోమవారం తెలంగాణ సాహితీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం.. పరిరక్షణ' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాద శక్తులు రాజ్యాంగానికి తూట్లు పొడిచేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్ని చట్టాలున్నా పేదోడికి న్యాయం అందని ద్రాక్షగానే మారిందన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన కవులు తమ కవితలను వినిపించారు. వీరిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, జిల్లా అధ్యక్షుడు ఖాజామైనొద్దీన్, గౌరవాధ్యక్షుడు ఎస్.జగపతిరావు, కార్యదర్శి కాళిదాసు, ప్రచార కార్యదర్శి ఆర్.ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ


అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐ కమలాకర్

జడ్చర్ల: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సీఐ కమలాకర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించి.. అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే వెంటనే 101 డయల్ చేయాలన్నారు. అంతకుముందు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక అధికారులకు నివాళులర్పించారు. అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది రాఘవేందర్, లక్ష్మీ కాంత్‌రెడ్డి, నవీన్‌కుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన


సాలార్‌నగర్‌లో గ్రామదేవతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి


బంద్రపల్లిలో ఎంపీ డీకే అరుణకు మెమెంటో అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గండేడ్: మండలంలోని సాలార్‌నగర్‌లో సోమవారం అమృత లింగేశ్వర, గణపతి, నంది, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహాలు, గ్రామదేవత విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి శివానంద్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజల అనంతరం దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మార్మోగిన శివనామస్మరణ..

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ ఊకచెట్టు వాగు సమీపంలో వెలసిన స్వయంభూ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శివలింగాయత్ ఆధ్వర్యంలో నందికోళ్ల సేవ, అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిన్నచింతకుంట: మండలంలోని బంద్రపల్లి సమీపంలో వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎంపీకి ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సోతో పాటు ఇతర సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక హైదరాబాద్‌లో ల్యాబ్ టెక్నీషియన్ చదువుతుంది. అయితే కోయిలకొండలో కొనసాగుతున్న జాతరకు వచ్చేందుకు ఆదివారం హైదరాబాద్ నుంచి తండ్రితో కలిసి బాలిక మహబూబ్‌నగర్‌కు బైక్‌పై బయల్దేరింది. ఈ క్రమంలో హరంఘర్ వద్ద బాలికను బస్సులో ఎక్కించి.. తండ్రి బైక్‌పై వచ్చాడు. సదరు బాలిక పట్టణంలోని ఎస్వీఎస్ వద్ద బస్సు దిగగా.. రామచంద్రాపూర్‌కు చెందిన పవన్ అనే యువకుడు బాలికను రోడ్డుపై కలిసి బైక్‌పై దించుతానని చెప్పి ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో బొక్కలోనిపల్లి వద్ద పంట పొలాల్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. అతడి నుంచి తప్పించుకుని రోడ్డుపైకి వచ్చిన బాలికను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పవన్‌పై పోక్సో ఇతర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

హోటల్ ధ్వంసం చేసిన వ్యక్తిపై..

రాజాపూర్(బాలానగర్): అర్ధరాత్రి సమయంలో జేసీబీతో హోటల్‌ను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బాలానగర్ ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఉన్న హిల్‌పార్క్ హోటల్ ముందుభాగాన్ని ఆదివారం రాత్రి కొందరు జేసీబీతో కూల్చివేశారు. స్థల వివాదం కారణంగా కావాలనే హోటల్‌ను ధ్వంసం చేశారని బాధితుడు జావిద్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయండి


హన్వాడ: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజోత్సవానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్ణాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్, లక్ష్మయ్య, జంబులయ్య, శ్రీనివాసులు, అనంతరెడ్డి, నాగన్న, మాధవులుగౌడ్, అంజిలయ్య, బసిరెడ్డి, రాములు, రాజు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్ర స్వామి కల్యాణం



కోయిల్‌కొండ: మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం నందికోళ్ల సేవ, భజన చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తమళి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిరుతలకు అడ్డా.. యన్మన్‌గండ్ల దేవరగుట్ట



నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలో ఉన్న దేవరగుట్ట కొన్ని రోజులుగా చిరుతలకు అడ్డాగా మారింది. మూడు రోజుల క్రితం దేవరగుట్టలో రెండు చిరుతల సంచారం కనిపించింది. నాటి నుంచి అవి అక్కడే మకాం వేసి ఉండటం చూస్తే.. చిరుతలకు ఆ గుట్ట ఆవాసంగా మారిందని చెప్పవచ్చు. యన్మన్‌గండ్లకు కిలోమీటర్ దూరంలో ఉన్న దేవరగుట్టను చిరుతలు ఆవాసంగా మార్చుకోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గుట్ట చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. కాగా, చిరుతల సంచారంపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోయారు. నిత్యం చిరుతలు గుట్టపై సేద తీరుతూ.. గుండ్లపై గంతులు వేస్తూ కనిపిస్తుండటంతో గ్రామస్తులు వణికిపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి గుట్టపై ఉన్న చిరుతలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
మహబూబ్‌నగర్ మహ్మద్ తౌసిఫ్ అలీ - 73969 95582
కోస్గి కె. రమేష్ - 99486 98552
జడ్చర్ల సి. అంజనేయులు - 80966 88450

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
శ్రీశైలం - 97051 35557
వెంకటయ్య - 90108 69797